క్లుప్తంగా

పాఠశాలకు చేరిన బడి బయట ఉన్న చిన్నారి



స్వాతిని బడిలో చేర్పిస్తున్న వలంటీర్ కాటమయ్య

బత్తలపల్లి: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. బత్తలపల్లిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన స్వాతి అనే చిన్నారి బడి బయట ఉండగా వలంటీర్ కాటమయ్య గుర్తించి బడిలో చేర్పించారు. పట్టణానికి చెందిన శ్రీప్రసాద్, నాగవేణి దంపతులు కరోనాకు ముందు బెంగుళూరుకు వలస వెళ్లారు. స్థానికంగా ఉపాధి లభిస్తుండటంతో తిరిగి పట్టణానికి విచ్చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా ఒక కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. మరో కుమార్తె స్వాతి ఇంటి వద్ద ఉండగా వలంటీర్ కాటమయ్య గుర్తించి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆ బాలికను స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చేర్పించారు. హెచ్ఎం జయంతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు.

మహిళా సంఘాలకు విరివిగా రుణాలు ఇవ్వండి



మాట్లాడుతున్న బ్యాంక్ ఎల్‌డీఎం రమణ

ధర్మవరం రూరల్: మహిళా సంఘాలకు విరివిగా రుణాలు ఇచ్చి వారు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలని ఎల్‌డీఎం ఏవీ రమణ కుమార్ బ్యాంకర్లకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెఎంఎల్‌బీసీ సమావేశాన్ని నిర్వహించారు. మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, జగనన్న తోడు, రాయితీ రుణాలు, చిరువ్యాపారాల నిమిత్తం రుణాల పంపిణీ, బ్యాంకర్ల ద్వారా మహిళా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఏసీఓ రామేశ్వర్‌రెడ్డి, ఏపీఎం రఘునాథరెడ్డి, కనగానపల్లి, రామగిరి, సీకేపల్లి మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

రూ.67,944 రికవరీకి ఆదేశం



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

ముదిగుబ్బ: మండలంలో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులను ఇటీవల 17వ విడత సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. అక్కడ గుర్తించిన అంశాలను వివరించేందుకు మండల కేంద్రంలోని బాలాజీ కళ్యాణ మండపంలో గురువారం ప్రజా వేదికను నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ మొత్తం రూ.16,96,82,012 విలువైన పనులు చేయగా రూ.67,944 మేర అవినీతి జరిగినట్లు తేలిందన్నారు. ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, డ్వామా పీడీ రామాంజినేయులు, ఏపీడీ వెంకటా చలపతి, ఎంపీపీ ఆదినారాయణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులను దూషించాడని ఫిర్యాదు



ఫోన్‌లో పోలీసులకు సమాచారం అందిస్తున్న మేనేజర్ సుభాషిణి

పుట్టపర్తి అర్బన్: బ్యాంకు అధికారులను దూషించి బ్యాంకు ఆస్తులకు నష్టం కలిగించినట్లు పెడబల్లికి చెందిన జగదీష్ అనే వ్యక్తిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని పెడపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుభాషిణి తెలిపారు. వివరాలు..గురువారం సాయంత్రం బ్యాంకు పనివేళలు ముగిసే సమయంలో ఫొటోస్టుడియో నిర్వాహకుడు జగదీష్ బ్యాంకుకు వచ్చాడు. తమ దుకాణానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేశాడు. ఉన్నతాధికారులకు చెప్పి తొలగిస్తామని చెప్పినా వినకుండా ఫ్లెక్సీలు చించివేసి అధికారులను దూషించాడు. మీరు మా ఊరికి ఎలా వస్తారో చూస్తానని బెదిరించాడు. దీంతో బ్యాంక్ ఆర్ఎం ఆదేశాల మేరకు పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు మేనేజర్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక 5వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ వార్డులో సీసీ రోడ్లు నిర్మించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. లో వోల్టేజీ సమస్య ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల్లో గతంలో ఏ పాలకవర్గం చేయని విధంగా సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. సీఎం వైఎస్ జగన్.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి పేదల మన్ననలు పొందారన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. బూటకపు హామీలతో రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఒక్కటై మాయమాటలు చెబుతారని, అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్ లాలేనాయక్, వార్డు ఇన్‌చార్జ్ దాసూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



ప్రతిభావంతురాలికి ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాడు నేడు పథకం కింద రూ.16 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. విద్యాకానుక, వసతిదీవెన లాంటి కార్యక్రమాలతో పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సీఎం జగన్ మరో 30 ఏళ్లు అధికారంలో ఉండాలని అందరూ కోరుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎంపికైన ముగ్గురు పదవతరగతి, నలుగురు ఇంటర్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సన్మానించారు. ఎంపీపీలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



వెంకటాపురంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రమేష్

కొత్తచెరువు: మండలంలోని మైలసముద్రం, కేశాపురం, నారేపల్లి గ్రామాల్లోని జగనన్న లేఔట్లను గురువారం హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఏఏ దశల్లో ఎన్ని ఇళ్ల నిర్మాణాల్లో ఉన్నాయనే విషయాలపై అధికారులను ఆరా తీశారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ సిద్దార్థరెడ్డి, ఏఈ రమణారెడ్డి పాల్గొన్నారు.
ఓడీ చెరువు: జగనన్న లేఔట్లలో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలని జిల్లా హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఆఫీసర్, మండల ప్రత్యేకధికారి రమేష్ అన్నారు. ఓడీ చెరువు మండలంలోని అల్లాపల్లి, వెంకటాపురం గ్రామాల్లోని జగనన్న లేఔట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. లేఔట్లలో నీరు, విద్యుత్, రోడ్లు తదితర సదుపాయాలు కల్పించామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప,దిలీప్, చేతన్‌కుమార్ పాల్గొన్నారు.
నల్లమాడ: జగనన్న లేఔట్లలో ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులను చైతన్యపరచి పనులు ప్రారంభించేలా చూడాలని హౌసింగ్ సిబ్బందికి ఎంపీడీఓ కొండన్న సూచించారు. దొన్నికోట వద్ద ఉన్న జగనన్న లేఔట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఎంతమంది నిర్మాణాలు చేపట్టారు, ఎంతమంది పనులు మొదలు పెట్టలేదనే వివరాలు సేకరించారు. పేదలందరికీ ఇళ్ల పథకం లక్ష్యాన్ని పూర్తి చేయాలని, నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ మసకవంకపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత కురుమాల సచివాలయాన్ని తనిఖీ చేశారు.

ఆపద సమయాల్లో 'దిశ యాప్' అండ



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: ఆపద సమయాల్లో అపన్నహస్తమిస్తున్న దిశ యాప్ గురించి బత్తలపల్లి పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం మండల కేంద్రంలో ఎస్ఐ టీవీ శ్రీహర్ష, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి ఆధ్వర్యంలో పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు జాతీయ రహదారిపై వాహనదారులను నిలిపి స్మార్ట్‌ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరికీ దిశ యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. వారి ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఆపద సమయాలలో, అత్యవసర పరిస్థితులలో ఈ యాప్ మహిళలకు తోడుగా నిలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులలో ఫోన్‌ను అటు ఇటు కదిపితే వారి లొకేషన్ సమీప పోలీస్ స్టేషన్లకు చేరుతుందన్నారు. నిమిషాల వ్యవధిలోనే సిబ్బంది వచ్చి సహాయం అందిస్తారని వాహనదారులకు తెలియజేశారు.

ఈకేవైసీ నమోదుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

- ఏడీఏ సత్యనారాయణ



కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన దృశ్యం

కదిరి అర్బన్: పీఎం కిసాన్ పథకంలో ఇప్పటివరకు ఈకేవైసీ నమెదు చేయించుకోని రైతులకోసం కదిరి ఏడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 25లోగా ఈకేవైసీ చేయించుకుంటేనే 14వ విడత పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ల్యాండ్ సీడింగ్ తహసీల్దార్ కార్యాలయంలో, అకౌంట్ ఆధార్ సీడింగ్ బ్యాంకుల్లో నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అందుబాటులోని లేని రైతులు కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి ఓటీపీ నెంబర్‌చెబితే ఈకేవైసీ చేస్తారని పేర్కొన్నారు. అమడగూరు మండలంలో 1109 మంది, గాండ్లపెంట 885, నల్లచెరువులో 1036, నల్లమాడ 1601, కదిరి 1508, ముదిగుబ్బ 2301,ఓడీ చెరువు 1584,తలుపుల1823,తనకల్లు 2011,ఎన్పీకుంట 359, మొత్తం 14,217 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరందరికీ కంట్రోల్‌రూమ్‌నుంచి ఫోన్ చేస్తారని తెలిపారు.

ప్రజలతో మమేకమై సేవలు అందించేది పోలీసులే

- బదిలీపై వెళ్తున్న సీఐ, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లకు ఘన సన్మానం



బదిలీపై వెళ్తున్న సీఐ, ఏఎస్ఐ, సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఐ టీవీ శ్రీహర్ష తదితరులు

బత్తలపల్లి: ఇతర శాఖలలో కంటే పోలీస్ శాఖ ద్వారానే ప్రజలకు మంచి సేవలు అందించవచ్చునని పోలీసు అధికారులు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న సీఐ మన్సూరుద్దీన్, ఏఎస్ఐ ఖాశీం, హెడ్ కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, లక్ష్మన్న, పోలీసులు కృష్ణమోహన్, వెంకటప్రసాద్, సురేష్, నాగరాజులకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బత్తలపల్లి ఎస్ఐ టీవీ శ్రీహర్ష అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ వహీద్‌బాషా, ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు, పోతుకుంట, తాడిమర్రి ఎస్ఐలు ప్రదీప్‌కుమార్, లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు అన్యాయానికి గురైనప్పుడు, సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి మేమున్నామనే ధైర్యం ఒక్క పోలీసు మాత్రమే ఇవ్వగలరన్నారు. అలాంటి శాఖలో పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు. బదిలీపై వెళ్తున్నవారు మాట్లాడుతూ తమ విధి నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్ పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు

గాండ్లపెంట: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ సుబ్బరాయుడు గురువారం తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 62 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిలో (వెనుకబడిన కులాల) విద్యార్థులకు 54, గిరిజన తెగల విద్యార్థులకు 5, ముస్లిం మైనారిటీ (బీసీ ఈ) విద్యార్థులకు 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల ఆఖరు వరకు గడువు ఉందని తెలిపారు.

జామియా మసీదు కమిటీ ఎన్నిక

ఎన్పీకుంట: పెడబల్లిలోని జామియా మసీదు నూతన కమిటీ ఎన్నిక గురువారం మండల కేంద్రంలోని జామియా మసీదులో జరిగింది. మండల ప్రభుత్వ ఖాజీ హజ్రత్ బాబ్జాన్ (యూసుఫ్) ఆధ్వర్యంలో పెడబల్లి గ్రామానికి చెందిన ముస్లిం మత పెద్దల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ముతవల్లిగా పఠాన్ రఫీఖాన్‌ను, సాని ముతవల్లిగా ఇష్రత్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మసీదు అభివృద్ధి పనులన్నీ వీరి ఆధ్వర్యంలోనే జరగాలని తీర్మానం చేశారు.

నేటి నుంచి గడప గడపకూ...

పుట్టపర్తి: బుక్కపట్నంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

రేపు గడప గడపకూ...

నల్లచెరువు: ఊబిచర్ల సచివాలయ పరిధిలోని గొర్లోల్లపల్లి, గోరంట్ల పల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొంటారని ఎంపీపీ రమణారెడ్డి గురువారం తెలిపారు.

వృద్ధులకు ఆప్యాయత పంచాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: వయోవృద్ధులను వేధించకుండా ఆదరించి ఆప్యాయత పంచాలని రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యుడు డాక్టర్ నరసింహులు, సత్యసాయి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు పోలా ప్రభాకర్, డాక్టర్ సత్య నిర్ధారణ్ సూచించారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న మధు కంటి వైద్యశాలలో గురువారం ఎల్డర్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు సేవలు చేయడం నేటి యువతరం మర్చిపోవడం బాధాకరమన్నారు. ఏవైనా సమస్యలుంటే ఎల్డర్ లైన్ టోల్‌ఫ్రీ 14567 నంబర్‌కు వృద్ధులు ఫోన్ చేయాలన్నారు.
తాడిమర్రి: మండల కేంద్రంలోని రాస్ వృద్ధుల ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ మాట్లాడారు. వృద్ధులు కుటుంబ సభ్యుల మధ్య చక్కటి సహకారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం వృద్ధులకు లగేజీ బ్యాగులు పంపిణీ చేశారు. ఎల్డర్స్ క్లబ్ అనంతపురం జిల్లా గవర్నర్ నబి రసూల్, ఆశ్రమ మేనేజర్ శ్రీనివాసులు, వృద్ధులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సతీమణి ఆర్థిక సహాయం



రామకృష్ణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోట్లమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తరికె రామకృష్ణ కుటుంబానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ అండగా నిలిచారు. గురువారం బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం కల్పించారు. అదేవిధంగా గతనెల 29న మృతి చెందిన ధర్మవరం పట్టణంలోని ఐదవ వార్డుకు చెందిన పామిశెట్టి వాసు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

మహనీయుల ఫొటోల వితరణ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలో ఉన్న గ్రాంథాలయానికి విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరత్నం గురువారం మహనీయుల ఫొటోలను వితరణ చేశారు. సత్యసాయి బాబా స్ఫూర్తితో ఇలాంటి సేవా కార్యక్రమాలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రంథాలయ అధికారి అంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కదిరి టౌన్: కదిరి అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని కుటాగుళ్ల -2 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కేంద్రానికి బాలింతలు, గర్భిణులు ఎంత మంది వస్తున్నారు? వారికి అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. చిన్నారులకు పాలు, కోడిగుడ్లు, భోజనం సక్రమంగా పెడుతున్నారా? లేదా? అని ఆరా తీశారు. సీడీపీఓలు వరలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

పండ్ల తోటలు సాగు చేసుకోండి



గులాబీతోటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సౌజన్యకుమారి

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు, పూల తోటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం నుంచి విరివిగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఎంపీడీఓ సౌజన్య కుమారి తెలిపారు. మండల పరిధిలోని నిమ్మలకుంట, పోతులనాగేపల్లి గ్రామాల్లో ఉపాధి హామి పథకం ద్వారా సాగు చేస్తున్న చీనీ, గులాబీ తోటలను గురువారం ఆమె పరిశీలించారు. పండ్లతోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఉపాధి పథకం ఏపీఓను సంప్రదించాలని సూచించారు. అనంతరం పోతులనాగేపల్లి సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రత, పశు బీమా పథకం, జగనన్న చేదోడు తదితర పథకాల అమలుపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి, జేఈ నాగేంద్ర, టీఏ చంద్రకళ, ఎఫ్ఏలు శివకుమార్, మురళీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలుపుల: మండలంలోని కొత్తపూలవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డి(60) అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీపీ రఫీనాయక్, కుర్లి శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతిపత్రం

కదిరి టౌన్: మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలపై మేనేజర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జీఎల్.నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



బ్రెడ్లు, పండ్లు పంపిణీ దృశ్యం

తాడిమర్రి: ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో కార్యకర్త గద్దె రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. నార్సింపల్లిలోని వృద్ధాశ్రమంలో అగ్రహారం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలోఅన్నదానం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

బాలుడి అదృశ్యం



హర్షవర్ధన్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: న్యామద్దలకు చెందిన హర్షవర్ధన్ రెడ్డి (17) కనిపించలేదని తండ్రి మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. బాలుడు కొద్దిరోజులుగా పబ్జీగేమ్‌కు బానిసై మతిస్థిమితం కోల్పోయాడని, ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 9440796835కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పంట రుణాల పరిమితిని పెంచాలి

కనగానపల్లి: బ్యాంకుల ద్వారా రైతుల తీసుకునే ఖరీఫ్ పంట రుణాల పరిమితిని మరింత పెంచాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కనగానపల్లిలో సమావేశమైన సీపీఐ నాయకులు మహదేవ, బాలరాజు, గోవిందు మాట్లాడుతూ ఖరీఫ్ పంటలపై తీసుకుంటున్న పంట రుణాల పరిమితిని 50 శాతం పెంచాలని, హంద్రీనీవా కాలువ ద్వారా విడుదల చేస్తున్న 40 టీఎంసీల నీటిని 100 టీఎంసీలకు పెంచి చెరువులకు నీరందించాలన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

ఎన్పీకుంట: బత్తినిగారిపల్లి గ్రామ శివారులో పేకాట జూదం జరుగుతున్నట్లు సమాచారంతో గురువారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్ఐ సద్గురుడు తెలిపారు. నలుగురు జూదరులను అరెస్ట్ చేసి రూ.7,800 స్వాధీనం చేసు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

పుట్టపర్తి టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికుల, ఇంజినీరింగ్ సిబ్బంది గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రెగ్యులర్ చేయాలని, హెల్త్ రిస్క్ అలవెన్స్‌లు చేయాలని డిమాండ్ చేశారు. ఏఈ స్వాతికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచండి

ఎన్పీకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిలలిక సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఎంపీడీఓ ఆదినారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. కొత్త అడ్మిషన్లపై ఆరా తీశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో మెరుగైన వైద్యం



వైద్య చికిత్సలు అందిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో మెరుగైన వైద్యం అందిస్తామని డాక్టర్ జ్యోతిర్మయి గ్రామస్తులకు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె నాయనపల్లి గ్రామంలో గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు షుగర్, బీపీ, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు.